క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్యశిబిరం నేడు

పొదలకూరు: పట్టణంలోని విజేత స్కూల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నామని కరస్పాండెంట్ కామాక్షమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతిలోని వెంకటేశ్వర, అరవింద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వివరించారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ, ఫోన్ నంబర్‌ను అందజేయాలని కోరారు. అవసరమైన వారికి ఉచిత ప్రయాణం, భోజన ఖర్చులను భరించి శస్త్ర చికిత్సలను చేయనున్నామని పేర్కొన్నారు.

విశేషాలంకారంలో వెంకయ్యస్వామి



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల వెంకయ్యస్వామి మందిరంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు. ఉభయకర్తలుగా బొర్రా మోహన్, వెంకట్రావు వ్యవహరించారు.

పౌష్టికాహారం అందజేత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ స్టేడియంలో క్రీడాకారులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. దాత వై.విష్ణువర్ధన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపినాథ్, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఎస్.రాఘవేంద్ర, రాజా రమేష్, చంద్రమౌళి, డీవీ సుబ్బరాజు, విజయ మోహన్‌నాయుడు, సుబ్బరామిరెడ్డి, ఖలీల్ బేగ్, రమేష్ పాల్గొన్నారు.

పార్కుల్లో యోగాంధ్ర కార్యక్రమాలు

నెల్లూరు(బారకాసు): నగరంలో యోగాంధ్ర కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం నగరంలోని పలు పార్కుల్లో యోగాంధ్ర కార్యక్రమాలు జరిగాయి. గురువులు యోగాపై అవగాహన కల్పించి యోగసనాలు వేయించారు. యోగా వల్ల కలిగే మానసిక ప్రశాంతత, ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో మారిన ఆహారపు అలవాట్లు, తగ్గిన శారీరక శ్రమ, పెరిగిన ఒత్తిళ్లతో శరీరంలో కొలెస్ట్రాల్ పేరుకుపోయిందని, దీంతో చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, గుండె పోటు వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో యోగాసనాలతో వాటిని ఎలా దూరం చేయవచ్చో వివరించారు. యోగాను దినచర్యగా మార్చుకోవాలన్నదే యోగాంధ్ర లక్ష్యంగా వివరించారు. కార్యక్రమాల్లో యోగా గురువులు రమేష్, రవీంద్ర, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఒక్కొక్కటిగా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నాయకులు, డాక్టర్లతో శనివారం ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు సూపర్ స్పెషాలిటీ సేవల్లో భాగమైన గుండె సంబంధిత వ్యాధుల కోసం కార్డియాలజిస్ట్ లేరన్నారు. ఇప్పుడు కొత్తగా డాక్టర్ మంజుల అనే కార్డియాలజిస్ట్ వైద్య సేవలందిస్తున్నారన్నారు. ప్రతి సోమ, గురువారం కార్డియాలజి ఓపీ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. అలాగే ఇప్పటివరకు న్యూరో ఫిజిషియన్‌గా డాక్టర్ ఫణికుమార్ సేవలందించేవారన్నారు. ఇప్పుడు ఆయనతో పాటు మరో న్యూరోఫిజిషియన్ డాక్టర్ ఆలమంద వెంకటఅనుపమ విధుల్లోకి చేరారన్నారు. గతంలో వారానికి రెండు రోజులు ఉన్న న్యూరో ఓపీని ప్రస్తుతం మూడు రోజులకు పెంచబోతున్నామన్నారు. అలాగే యురాలజి, న్యూరోసర్జరీ, సర్జికల్ అంకాలజి, రేడియేషన్ అంకాలజి లాంటి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయని, రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు పెట్టుకోకుండా పెద్దాస్పత్రిలో ఉచిత సేవలు పొందాలని సూచించారు.

కోవిడ్ వార్డు ఏర్పాటు

కరోనా కేసులు మళ్లీ నమోదవుతున్న నేపథ్యంలో పెద్దాస్పత్రిలో ముందస్తుగా 30 పడకలతో పల్మనాలజి విభాగంలో వార్డు ఏర్పాటు చేశామని సూపరింటెండెంట్ సిద్ధానాయక్ తెలిపారు. కరోనా పరీక్షలు చేసే కిట్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలు జనసమూహంలోకి వెళ్ల వద్దన్నారు. మాస్కులు ధరించాలని కోరారు. కరోనా కేసులు నమోదైతే ఎదుర్కొనేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, హెచ్‌డీఎస్ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులుగౌడ్, సభ్యుడు దారా మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



సమస్యలపై ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



16వ వార్డులో సమస్యలపై కమిషనర్‌కు అర్జీ ఇస్తున్న కౌన్సిలర్ ప్రమీలమ్మ

- నిలదీసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు
- వాడీవేడిగా నగర పంచాయతీ సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు షేక్ షాహుల్, యానాదిరెడ్డి, ప్రమీలమ్మ, షకీలాబేగం, మోర్ల జయంతి, అనంతమ్మ తదితరులు నగర పంచాయతీ పరిధిలోని సమస్యలపై కమిషనర్, చైర్‌పర్సన్‌ను నిలదీశారు. పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందన్నారు. 16వ వార్డు పరిధిలో తాగునీటి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొన్నిచోట్ల కలుషిత నీరు సరఫరా అవుతోందన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఐదో సచివాలయం, నగర పంచాయతీ కార్యాలయాల నిర్మాణం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందని విమర్శించారు. ఇటీవల నగర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 18 మంది పారిశుద్ధ్య సిబ్బందిని తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పట్టుబట్టారు. అలాగే కొత్తగా చేరిన కొంతమంది సిబ్బందిని ఇష్టమొచ్చినట్లు ఆప్కాస్‌లో చేర్చారని, ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారిని ఆప్కాస్‌లో ఎందుకు చేర్చలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆధార్ కార్డులో వయసు మార్పిడి చేసి కొంతమంది నగర పంచాయతీలో ఉద్యోగాలు పొందారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రాతినిథ్యం వహిస్తున్న వార్డుల్లో అభివృద్ధి పనులు తమ ప్రమేయం లేకుండా చేయడం సరికాదని, తమను సంప్రదించకుండానే టీడీపీ నాయకులు వారికి నచ్చిన కాంట్రాక్టర్లతో పనులు చేయిస్తున్నారని వాపోయారు. ఇటువంటి చర్యలను తాము సహించబోమన్నారు. తాము అడిగిన ప్రశ్నలకు కమిషనర్ సమాధానం చెప్పాలన్నారు. అనంతరం కమిషనర్ బాలకృష్ణ మాట్లాడుతూ నగర పంచాయతీలో సిబ్బంది నియామకం, తొలగింపు ప్రక్రియ తన హయాంలో జరగలేదని, తనకు సంబంధం లేదని తెలిపారు. సంబంధం లేదనడం సరికాదని, గతంలో జరిగిన వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కమిషనర్‌పై ఉందని కౌన్సిలర్లు అన్నారు.

రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు

సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టిన 25 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో నుడా నిధులు రూ.కోటి, ఎల్‌ఆర్‌ఎస్ నిధులు రూ.కోటితో త్వరలో అభివృద్ధి పనులు మొదలు పెడతామని వివరించారు. ఒక్కో వార్డుకు రూ.10 లక్షల చొప్పున కేటాయిస్తామని వివరించారు. ఈ నిధులతో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా సమయపాలన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని మునులపూడి గ్రామంలో వీపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి శనివారం ప్రారంభించారు. అయితే సాయంత్రం 4 గంటలకు ప్లాంట్‌ను ప్రారంభించాల్సి ఉండగా ఎంపీ, ఎమ్మెల్యే గంట ఆలస్యంగా హాజరయ్యారు. దీంతో కార్యక్రమానికి తరలించిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు. మండలంలో ఇప్పటివరకు జరిగిన కార్యక్రమాలకు సంబంధించి ఎమ్మెల్యే ఎప్పుడూ సరైన సమయానికి హాజరు కాలేదు. కాగా కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యం కాకుండా కార్యక్రమాలకు హాజరయ్యేవారని అక్కడున్నవారు మాట్లాడుకోవడం కనిపించింది.

మీడియాకు సమాచారం లేదు

ఎమ్మెల్యే, ఎంపీ వాటర్‌ప్లాంట్ కార్యక్రమానికి వస్తున్నట్లుగా మీడియాకు ముందస్తు సమాచారం లేదు. వాస్తవానికి ముందురోజే మీడియాకు సమాచారం ఇవ్వాల్సి ఉండగా, శనివారం సాయంత్రం 4:03లకు ఓ వాట్సాప్ గ్రూపులో మండల టీడీపీ నాయకుడు బత్తల హరికృష్ణ సమాచారం అందించారు. ఇలా చివరి నిమిషయంలో సమాచారం ఇవ్వడంపై పలువురు మీడియా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా ఇలా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వెండినందిపై ఆదిదంపతుల విహారం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు తిరుచా ఉత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం వెండినంది వాహనంపై ఆది దంపతులు విహరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

శిలాఫలకాన్ని కప్పి ఉంచారెందుకు!

- నిరసన తెలిపిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



శిలాఫలకం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నగర పంచాయతీ కార్యాలయంలో ప్రారంభించిన నాలుగో సచివాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఎందుకు బ్యానర్‌తో కప్పి ఉంచారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. బుచ్చిలో శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు హాజరై, మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన సచివాలయ ప్రారంభోత్సవ ప్రొటోకాల్ శిలాఫలకాన్ని కప్పి ఉంచడం సరికాదన్నారు. వెంటనే బ్యానర్ తొలగించాలని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు షాహుల్, ప్రమీలమ్మ, యానాదిరెడ్డి, షకీలాబేగం తదితరులు డిమాండ్ చేశారు. దీనిపై నగర పంచాయతీ సిబ్బందిని వివరణ కోరగా ఇటీవల నగర పంచాయతీలో కోఆప్షన్ మెంబర్ల ఎంపిక జరిగిందని, ఆ సమయంలో శిలాఫలకాన్ని మూసివేశామని తెలిపారు. వెంటనే బ్యానర్ తొలగిస్తామని తెలిపారు.

'శ్రీవెంకటేశ్వర'లో జాబ్ మేళా రేపు

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది ప్రముఖ కంపెనీలు 500 ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

యోగాంధ్ర యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న వినోద్‌బాబు

పొదలకూరు: యోగాంధ్ర యాప్ రిజిస్ట్రేషన్లపై పంచాయతీ సెక్రటరీలకు అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ వైద్యాధికారి వినోద్‌బాబు మాట్లాడారు. జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఏపీ నుంచి రెండు కోట్ల మంది పాల్గొనే అవకాశం ఉందని, ఈ క్రమంలో యాప్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం దళితవాడలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం శనివారం రాత్రి కమనీయంగా సాగింది. ఆలయ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, కళ్యాణి దంపతులతో స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివార్ల కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు చిమటా శేషగిరి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, నాయకులు అడపాల మోహనకృష్ణ, కొండా శ్రీనివాసులురెడ్డి, శివుని నరసింహులురెడ్డి, రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, బచ్చు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సరుకుల పంపిణీ



డీలర్లకు సూచనలిస్తున్న తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి

కొడవలూరు: చౌక దుకాణాల్లో సరుకుల పంపిణీ పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చౌక డిపోల డీలర్లతో శనివారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి చౌక డిపోల ద్వారా రేషన్ పంపిణీ జరుగనుందన్నారు. డీలర్లు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రేషన్ పంపిణీ చేయాలన్నారు. తరచూ తాను తనిఖీలు చేస్తానని, నిల్వల్లో తేడాలున్నా, సరుకుల పంపిణీలో పేదలకు ఇబ్బందులు కలిగించినా సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఎస్ డీటీ బాలకోటమ్మ, డీటీ సారంగపాణి, ఆర్‌ఐ సునీల్‌రెడ్డి, సీనియర్ సహాయకుడు మస్తాన్‌బాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సమాజంలో ఉన్నతంగా ఎదగాలి



దుస్తుల అందజేత

మనుబోలు: సమాజంలో ఎస్టీలు ఉన్నతంగా ఎదగాలని జెడ్పీ సీఈఓ విద్యారమ కాంక్షించారు. మండలంలోని లక్ష్మీనరసింహపురం ఎస్టీ కాలనికి చెందిన చల్లా యానాదులకు వస్త్రాలను పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడారు. అవగాహన లేమితో అభివృద్ధికి ఎస్టీలు దూరంగా ఉండిపోతున్నారని చెప్పారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ట్రస్ట్ చైర్మన్ పోతుగుంట మల్లికార్జునను అభినందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనానాయక్, సర్పంచ్ సునీల్, కృష్ణమనాయుడు, ట్రస్ట్ సభ్యులు అరుణ్‌బాబు, యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ, ఎస్సై

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని కామాక్షితాయి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శనివారం పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రథోత్సవంతో పాటు కల్యాణం, తెప్పోత్సవం జరుగనున్న నేపథ్యంలో రాబోయే మూడు రోజులు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామని తెలిపారు. ఎస్సై సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



కొడవలూరు: వీపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొడవలూరులో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా శుద్ధ నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.శ్రీహరిరెడ్డి, జీవీఎన్.శేఖర్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, జిలాని బాషా, కోవూరు వెంకి తదితరులు పాల్గొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లులను చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాలు ఆదివారం కూడా పనిచేస్తాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విజ్ఞాన శిబిరాలతో చిన్నారులకు మేలు



విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

విడవలూరు: వేసవి విజ్ఞాన శిబిరాలతో చిన్నారులకు ఎంతో మేలు అని ఎన్జీఓ శేఖర్ అన్నారు. విడవలూరులోని గ్రంథాలయంలో చిన్నారులకు నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలన్నారు. అనంతరం పుస్తక ప్రదర్శన, చిన్నారులకు ఆటలు, క్విజ్ పోటీలతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో మిగిలిన విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ టి.నిరూప కోరారు.

రాష్ట్ర బూత్ కమిటీలో జిల్లా నాయకుడికి చోటు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన వడ్లమూడి నరేష్‌నాయుడును పార్టీ రాష్ట్ర బూత్ కమిటీల విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

నేత్రపర్వం.. రథోత్సవం



రథోత్సవం



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని శనివారం నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాలను జరిపారు. ఉభయకర్తలుగా కొమ్మి వేణుగోపాల్, కామాక్షి.. మెంతెం బాలకృష్ణారెడ్డి, శ్రీలక్ష్మి.. సుంకర రవికుమార్, గీత దంపతులు వ్యవహరించారు. పుష్పయాగం, మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణం తదితరాలను రాత్రి నిర్వహించారు. ఉభయకర్తలుగా అన్నం లక్ష్మీనారాయణ, లక్ష్మి దంపతులు వ్యవహరించారు.